న్యూస్‌రీల్

ధర్తి అబ భగీ ధరిపై అవగాహన



సర్టిఫికెట్లతో గిరిజనులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్ల గిరిజన గూడెంలో ధర్తి అబ భగీ ధరి అభియాన్ కార్యక్రమంపై చెంచు గిరిజనులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ కార్యదర్శి రంగయ్య హాజరై మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల గురించి గిరిజనులకు వివరించారు. పతి ఒక్కరికి ఇల్లు, మంచి నీరు, విద్యుత్, రహదారులు, రేషన్ కార్డులులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 10 కుటుంబాలకు క్యాస్టు సర్టిఫికెట్లు, రెండు కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు, 12 కుటుంబాలకు ఇన్‌కం సర్టిఫికెట్లు, 32 కుటుంబాలకు హౌసింగ్‌కు సంబంధించిన వివరాలు అందజేశారు. టెక్నికల్ అసిస్టెంట్ లాలా అహ్మద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థి ‘విట్’లో ఉచిత అడ్మిషన్

పొదిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.భవాంజనేయులు ఇంటర్మీడియెట్‌లో 967 మార్కులు సాధించాడు. ప్రకాశం జిల్లా బాయ్స్ విభాగంలో మెరిట్ మార్కులు సాధించిన భవాంజనేయులకు అమరావతిలోని విట్ డీమ్డ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌లో ఉచితంగా అడ్మిషన్ దక్కింది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ కె.వాసు దేవ్, అధ్యాపకులు ఉండేల నరసారెడ్డి, పి.సుజాత, పి.రమణారెడ్డి, ఎల్.పద్మారావు అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



దొనకొండ: రైతులతో మాట్లాడుతున్న ఏఓ



రైతులతో మాట్లాడుతున్న గోపీకృష్ణ



వంగ పంటను పరిశీలిస్తున్న ఏవో నీరజ

పత్తిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

పుల్లలచెరువు: వివిధ గ్రామాల్లో ముందుగా సాగు చేసిన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణాధికారి గోపీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ముటుకుల, గంగవరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సాగు చేసిన పత్తి పంటను పరిశీలి తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ముఖ్యంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులు వీఆర్వోల ద్వారా తీసుకోవాలన్నారు. సీసీ కార్డులు తీసుకున్న వారికి మాత్రమే అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులని తెలిపారు. సిబ్బంది మంత్రూనాయక్, కొండానాయక్ పాల్గొన్నారు.

నకిలి విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి

పెద్దారవీడు: ఖరీఫ్‌లో సాగు చేసే రైతులు నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో సానికవరం గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలని అధికృత లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, కొన్న వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని చెప్పారు. రాత్రి పూట జీబుల్లో వచ్చి రసీదు ఇవ్వకుండా తక్కువ ధరకు విత్తనాలు అమ్మేవారి నుంచి కొనుగోలు చేయరాదని, అలాంటి వ్యక్తులు ఏవరైనా గ్రామాల్లో విత్తనాలు అమ్మితే వెంటనే సమీపంలో ఉన్న వ్యవసాయాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. మంచి విత్తనాలను ఎన్నుకోవాలని, విత్తన మొలక శాతం చూసుకోవాలని, విత్తనశుద్ధి చేసుకున్న తర్వాతనే పొలంలో విత్తుకోవాలని సూచించారు. కంది పంట సాగు చేసే రైతులు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి శిలింద్ర నాశినితో విత్తనశుద్ధి చేస్తే వేరు కుళ్లు తెగుళ్లు రాకుండా చేయవచ్చన్నారు. ఏఈఓ సునీల్‌నాయక్ మాట్లాడుతూ విత్తనాలు మొలక కట్టుకొను విధానాన్ని, విత్తనశుద్ధి చేసుకొనే పద్ధతులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీఏఏ శిరీష, రైతులు పాల్గొన్నారు.



పెద్దారవీడు: విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ సునీల్‌నాయక్



కురిచేడు: రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

దొనకొండ: రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు యజమాని దగ్గర తప్పని సరిగా బిల్లులు పొందాలని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు, వెంకటాపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయ శాఖ సేవలు వినియోగించుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా క్షేత్ర ప్రదర్శన జరుగుతుందని, పంటలపై ఆశించు చీడ పీడలు మరియు తెగుళ్ల గురించి తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని దానికి సంబంధించిన మందులు వాడుకుని అధిక దిగుబడులు పొందాలన్నారు. ఖరీఫ్‌లో పంటలకు ఇన్సూరెన్స్ రైతులే కట్టుకోవాలన్నారు. ఎకరా వరికి రూ.860, కందులు రూ.430, సజ్జ రూ.156, ఎండు మిర్చి రూ.4500, మినుములు రూ.205, నువ్వులు రూ.180, పత్తి రూ.2100 ప్రీమియం చెల్లించాలన్నారు. మునిబాబు, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: భూసార పరీక్షల ఫలితాల ఆదారంగా ఎరువులను వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడంతో పాటు నేల సారవంతాన్ని కాపాడవచ్చని మండల వ్యవసాయాధికారి బి.సంతప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొట్లపాడు, పడమర గంగవరం గ్రామాల్లోని రైతులను ఆయన మంగళవారం కలిసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ 2025–26 ఏడాదికి సంబంధించి జిల్లా నోటిఫైడ్ పంటలుగా వరి, కంది, సజ్జ, ఎండుమిర్చి, మినుము, నువ్వులు, పత్తి పంట ఎంపికైనట్లు పేర్కొన్నారు. రైతులు ఈ పంటలకు ప్రీమియం చెల్లించి పంటల బీమా పొందొచ్చన్నారు. కౌలుకార్డుతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల గురించి వివరించారు. జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. పొట్లపాడు సర్పంచ్ జ్యోతి సుబ్బులు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఖరీఫ్‌లో సాగచేసే విత్తనాలు శుద్ధి చేసి నాటుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో కె.నీరజ అన్నారు. మంగళవారం మండలంలోని వీరభద్రాపురం, మొగుళ్లపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో వేయబోయే పంటల పోషకాలు ఆర్గానిక్ కార్బన్, నైట్రోజన్, ఫారమ్యాడ్ మెన్యూర్, వర్మికంపోస్ట్ వంటి పోషక విలువలు భూమిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రధాన పంటల్లో అంతర్ పంటలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందే విధంగా ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు పొట్టయ్య, ధనేశ్వర్ నాయక్, మద్దయ్య, కె.రమేష్‌బాబు, ఎస్.జాషువా పాల్గొన్నారు.

జీఓ నంబర్–5ను సవరించాలి



కురిచేడు: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



ముండ్లమూరు: ఎంపీడీఓ జనార్దన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

దొనకొండ: ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓ నంబర్–5ను సవరణ చేయాలని, ఇతర డిమాండ్లను త్వరగా పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ వి.వసంతరావునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్–5 గ్రామ సచివాలయాల ఉద్యోగులకు ఇబ్బంది కలిగిస్తోందని నిరసన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందిని ఇబ్బందులు పెట్టకుండా ప్రభుత్వం జారీ చేసిన జీఓను సవరించాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ వసంతరావునాయక్ నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తామని చెప్పారు.

కురిచేడు: జీవో నంబర్–5ను సవరణ చేసి మండల స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వారికి కూడా సొంత మండలంలో పనిచేసే అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక కోరింది. ఈ మేరకు ఎంపీడీఓ, తహసీల్దార్‌లకు మంగళవారం 10 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసింది. 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జీవిస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులందరికీ ప్రమోషన్ ఇచ్చిన తర్వాతే బదిలీ చేయాలని, కొన్ని శాఖల ఉద్యోగులకు ఇప్పటికి సరైన ప్రమోషన్ చానెల్ ఏర్పాటు చేయలేదని, ఇలాంటి శాఖలకు వెంటనే ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయాలని, ప్రోబేషన్ డిక్లరేషన్ ఆలస్యమైన 9 నెలల సర్వీస్ చేసిన కాలానికి వెంటనే ఎరియర్స్ మంజూరు చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో సొంత మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో పని చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ సిబ్బంది

ముండ్లమూరులో..

వార్డు సచివాలయాల ఉద్యోగుల మాదిరిగానే గ్రామీణ మండలాల్లో పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలాలకు కోరుకునే విధంగా బదిలీలు చేపట్టాలని మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన సచివాలయం ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో చాలీచాలని జీతాలతో సుదూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించేందుకు కష్టతరం అవుతుందని ఉద్యోగులు వాపోతున్నారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయురాలు పల్లికోన శ్యాంప్రసన్న తాంజలి అభినందనలతో ముంచెత్తారు. పాఠశాలకు చెందిన షేక్ బషీర్, షేక్ మహ్మద్‌మాజ్, షేక్ చాందిని, షేక్ అస్మత్, షేక్ బాజీవలి, ఎంవీ దిలీప్‌కుమార్‌లు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు షేక్ రహమత్, డి.పోలయ్య, జి.విజయమాణిక్యం, వి.నాగమూర్తి, కిరణ్‌కుమార్, మీటీనాయక్, వెంకటశివ, శిరీషారాణి, పి.రామానాయక్, ఆవులయ్య, మహాదేవి, ప్రసాద్, అనిత, స్టాఫ్ సెక్రటరీ అనసూయాదేవితో పాటు పాఠశాల సిబ్బంది అభినందనలతో ముంచెత్తారు. దీంతో పాటు మండల పరిధిలోని రామచంద్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.పెద్దకాశమ్మ, డి. రిక్షాన, సీహెచ్ శ్రావణిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

దర్శి (కురిచేడు): దర్శి మండలం పొతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గుడిపాటి వెంకట పవిత్ర, చలువాది మోహనలక్ష్మిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.రాజేశ్వరి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. వీరు ఒంగోలు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు జి.చంద్రమోహన్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జి.బ్రహ్మారెడ్డి, పాపిరెడ్డిపాలెం సర్పంచ్ ముచ్చుమూరి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



కె.రాజేశ్వరి



జి.వెంకట పవిత్ర

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మోడల్ పాఠశాల విద్యార్థులు 9 మంది ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభకనబరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిరూపించారు. ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ అవార్డులు కూడా పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి మంచి భవిష్యత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల్లో అశ్విని, ప్రణతి, చారన్యరెడ్డి, ధనుష్కరెడ్డి, కీర్తన, గాయత్రి, బాలకృష్ణ, ధనుష్, మన్సూర్ ఉన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

మార్కాపురం: మార్కాపురంలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ సూచించారు. మంగళవారం మార్కాపురం కోర్టులో 6 మండలాల పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాలాజీ మాట్లాడుతూ.. కేసుల్లో ఉన్న వారు రాజీ చేసుకుని ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా చూడటం ద్వారా సమాజంలో శాంతి నెలకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భరణం కేసులు, బ్యాంకుల ప్రీ లిటిగేషన్ కేసులు, బీఎస్ఎన్ఎల్ ప్రీ లిటికేషన్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలని న్యాయమూర్తి సూచించారు. సమావేశంలో మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబుతోపాటు త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పెద్దారవీడు తదితర మండలాల ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తి బాలాజీ

పరిశుభ్రతతో ఆరోగ్యం

పెద్దారవీడు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని చట్లమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఏనుగుదిన్నెపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మలేరియా మాసోత్సవంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ గురించి, మలేరియా వృద్ధి చెందకుండా, దోమలు పెరగకుండా నివారణకు, కాలువలు ఎప్పటికప్పుడు మురుగు నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని, తద్వారా మలేరియా నివారణ చేసుకోవచ్చని సూచించారు. ఎంఈఓ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు మెస్ అమర్చుకోవాలని, సాధ్యమైనంత వరకు వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ సత్యమయ్య మాట్లాడుతూ ఏనాఫిల్ ఫిమేల్ దోమలతో మలేరియా వస్తుందని, జ్వరం వచ్చినప్పుడు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ టెస్ట్ లేక రక్తపూతల పరీక్షలు ద్వారా నిర్ధారణ అవుతుందని వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, హెల్త్ అసిస్టెంట్ భరత్, హెచ్ఎం అహ్మద్, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగం పెంచడమే లక్ష్యం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

దర్శి (కురిచేడు): విద్యుత్ వినియోగదారులు సోలార్‌ను వినియోగించుకునేలా సిబ్బంది ప్రోత్సహించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దర్శిలోని పీటీఎస్ కళ్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 1650 సోలార్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోలార్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించి కింది స్థాయి నుంచి ఎగువ స్థాయి వరకు విద్యుత్ అధికారులు ప్రతి ఒక్కరూ రెండు కనెక్షన్లు ఏర్పాటు చేయటమే లక్ష్యంగా పనిచేయాలని, ఒక కిలో వాట్‌కు 30 వేల రూపాయలు, రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలు, మూడు కిలోవాట్లకు 78 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. అధిక కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ అకౌంట్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఈఈ పి. శ్రీనివాసులు, డీఈఈ పి.రవికుమార్, దర్శి డివిజన్‌లోని డిప్యూటీ ఈఈలు, ఏఈలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

పాఠశాలను శుభ్రం చేయించిన హెచ్ఎం



శుభ్రం చేయిస్తున్న హెచ్ఎం ప్రభుదాస్

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల అపరిశుభ్రంగా ఉండటంతో నూతనంగా ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరిన ఆదిమూలపు ప్రభుదాసు మంగళవారం జేసీబీతో శుభ్రం చేయించారు. పాఠశాల ప్రాంగణం మట్టి కుప్పలతో, పిచ్చి చెట్లతో మూసుకు పోవటంతో విద్యార్థులకు ఇబ్బంది ఉంటుందని ముందు జాగ్రత్తగా ఆయన శుభ్రం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

మార్కాపురం/పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం నియోజకవర్గంలోని పలు మండలాలకు అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మార్కాపురం మండల పార్టీ అధ్యక్షుడిగా పోరెడ్డి చెంచిరెడ్డి, తర్లుపాడు అధ్యక్షుడిగా మురారి వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల అధ్యక్షుడిగా మోరా శంకర్‌రెడ్డి, పొదిలి నగర పంచాయతీ అధ్యక్షుడిగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సానికొమ్ముకు అభినందన

వైఎస్సార్ సీపీ పొదిలి నగర పంచాయతీ అధ్యక్షుడిగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. అభినందించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్ వై వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ జి.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా దత్తాచారి

గిద్దలూరు రూరల్: విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా గిద్దలూరుకు చెందిన షరాబు దత్తాచారిని నియమించినట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని దత్తాచారి పేర్కొన్నారు. ఆయనకు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.